క్లుప్తంగా

గ్రంథాలయంలో వైఫై ఏర్పాటు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని గ్రంథాలయంలో జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు చదువుతున్న యువతీ, యువకులకు గురువారం ఉచితంగా అన్‌లిమిటెడ్ వైఫై ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రూప్ 1,2,3,4, ఎస్సై, కానిస్టేబుల్, వివిధ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న కొత్తగూడెం పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మోదుగు జోగారావు, ప్రభాకర్, లైబ్రేరియన్, యువతీ, యువకులు పాల్గొన్నారు.

26న ఉచిత వైద్య శిబిరం

పాల్వంచ: ఈనెల 26న కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని యశోద హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించనున్నారు. గురువారం వైద్య శిబిరం ఏర్పాట్లను యశోద హాస్పిటల్స్ సీనియర్ డీజీఎం వీఎస్.రామారావు, ట్రస్ట్ మేనేజర్ అంజిబాబు, హెచ్ 142 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ.రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులు, పాల్వంచ, కొత్తగూడెం జర్నలిస్టులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షల అనంతరం అవసరమైన వారికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోగారావు, వెంపటి వెంకటేశ్వర్లు, ఎర్రగడ్డ ప్రసాద్, షేక్ సయ్యద్, రమణయ్య, గోపయ్య, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఎన్నిక



మండల గ్రామీణ వైద్యుల సంఘం

సుజాతనగర్: మండల గ్రామీణ వైద్యుల సంఘాన్ని సుజాతనగర్‌లో గురువారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గరీబ్‌పేట గ్రామానికి చెందిన రెడ్డిబోయిన శ్రీను, ఉపాధ్యక్షుడిగా కాసిమల్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా మురిపిటి వీరరఘురాం, ప్రచార కార్యదర్శిగా తుంపూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు వెంకట్రావు, జెల్ల కృష్ణ, నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సుజాతనగర్: క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. మండలంలోని గరీబ్‌పేట గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు. కరీమ్‌పాషా, రెడ్డిబోయిన వెంకన్న, నర్సింగ్ భిక్షం, ఉప్పలయ్య, మల్లయ్య, క్రీడాకారులు నవీన్, బన్ను, అఖిల్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు ఫిల్టర్ బెడ్ వద్ద మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో శుక్ర, శనివారాల్లో మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల అనంతరం ఆదివారం నీటి సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్ తండా శివారులో పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పేదలు ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నబి మాట్లాడుతూ.. 2011లో రెవెన్యూ అధికారులు పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, గుడిసెలు వేసుకున్న ప్రాంతానికి తక్షణం విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. మురికివాడల పథకం కింద ఉచితంగా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మన్యం మోహన్‌రావు, పాష, సంతోష్, కౌసల్య, వైకుంఠం, వీరభద్రం, వెంకన్న పాల్గొన్నారు.

కేసు నమోదు

సుజాతనగర్: సర్వారం గ్రామ పంచాయతీ బోడగుట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ బలవన్మరణంపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ పి.తిరుపతిరావు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దంగేటి శాంతి (53) కొంతకాలంగా మోకాళ్ల నొప్పులు, కిడ్నీ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. భర్త శంకర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వయం సమృద్ధితో పల్లెలు కళకళ



సంత ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న పాలకవర్గం

గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న తలసరి గ్రాంటును నిబంధనల మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనిని అధిగమించేందుకు స్వయంగా ఆదాయం తెచ్చిపెట్టే వనరులు ఉన్నా గ్రామ పంచాయతీలు వాటిపై దృష్టి సారించడం లేదు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరులో జరుగుతున్న తాత్సారం మండలంలోని పోలారం గ్రామపంచాయతీని స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయించింది. పాలకవర్గం సమష్టి కృషితో ఇప్పటికే అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామపంచాయతీని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలివ్వగా తాజాగా సంత ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. వెంటనే ఆచరణలో పెడుతూ శుక్రవారం సంతను ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఇలా ఆర్థిక వనరుల పెంపు ప్రయత్నాల్లో పోలారం పంచాయతీ ఇతర గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది.

- ఆర్థిక వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి
- ప్రజల సహకారంతో ప్రత్యేక ప్రణాళిక
- నేడు వారపు సంత ప్రారంభోత్సవం

ఇల్లెందురూరల్: మండల కేంద్రానికి దూరంగా ఇరవైఅయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలారం గ్రామపంచాయతీలో గిరిజనులే అత్యధికంగా నివసిస్తుంటారు. ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉన్న గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దయనీయ స్థితి. ఇటువటి పరిస్థితిలో గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సరోజిని, పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో పంచాయతీ పరిధిలోని ఉపాధ్యాయుడు బాలు సహకారంతో కిట్స్ స్వచ్ఛంద సంస్థ చేయూతతో గ్రామపంచాయతీ పరిధిలో 300 వరకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంది. వారి సహకారంతోనే బొంబాయితండా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని మౌలిక సౌకర్యాలు సమకూర్చుకుంది. ఇంతేకాకుండా గ్రామపంచాయతీ పరిధిలోని వ్యాపారుల సహకారంతో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకున్నారు.

పన్నుల వసూలుతో ఆర్థిక పరిపుష్టి..

గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో తాత్సారం చేయడంతో పంచాయతీని నడపడం పాలకవర్గానికి ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఇటువంటి పరిస్థితిలో ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులపై దృష్టి సారించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం వ్యాపారం ద్వారా కాంటాలపై పన్ను రూపంలో ఏటా రూ.20 వేల ఆదాయం వస్తోంది. అంతేకాకుండా కంపోస్టును తయారు చేసి విక్రయించడం ద్వారా ఇప్పటి వరకు రూ.6వేల వరకు సమకూర్చుకున్నారు.



పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

నేడు పోలారంలో సంత ప్రారంభం...

గ్రామపంచాయతీలు ఆర్థిక వనరుల పెంపు కోసం వారపు సంతను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు సూచించింది. ఈ సూచనను అందిపుచుకున్న పోలారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేసింది. ఇల్లెందులో ఏజెన్సీ గుండాల వరకు 60 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మధ్యలో అనేక గ్రామపంచాయతీలు ఉన్నప్పటికీ ఏ ఒక్కచోటా సంత లేదు. అంతేకాకుండా పోలారం గ్రామపంచాయతీ నుంచి మర్రిగూడెం, రామచంద్రునిపేట, బోగు గ్రామపంచాయతీల మీదుగా టేకులపల్లి వరకు సంతలు లేవు. ఏజెన్సీ గ్రామపంచాయతీలకు దాదాపు సెంటర్‌గా ఉన్న పోలారం గ్రామంలో సంత ఏర్పాటు ద్వారా సత్ఫలితాలు ఉంటాయని భావించిన పోలారం గ్రామపంచాయతీ పాలకవర్గం అందుకు గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి పక్కనే సంత ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించింది. ఉన్నతాధికారుల అనుమతితో ప్రతి ఆదివారం వారపు సంత నిర్వహించాలని నిర్ణయించింది. దీనికోసం ఈనెల 24 శుక్రవారం సంతను ప్రారంభించనున్నారు. సంత నిర్వహణ ద్వారా గ్రామపంచాయతీ ఆర్థిక తోడ్పాటు ఉంటుందని పాలకవర్గం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

ప్రజల సహకారంతో వృద్ధి



ప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న నిధులు నిర్దేశించిన పనులకే సరిపోతున్నాయి. ప్రస్తుతం ఆ కాస్తా నిధులు కూడా మంజూరు కావడం లేదు. దీంతో గ్రామపంచాయతీలో పనులు సక్రమంగా చేపట్టేందుకు నిధుల సమీకరణపై దృష్టి సారించాం. ఇందులో భాగంగానే సంతను ఏర్పాటు చేస్తున్నాం. – వాంకుడోత్ సరోజిని, సర్పంచ్, పోలారం గ్రామపంచాయతీ

ఆదర్శ పంచాయతీయే లక్ష్యం



ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నాం. గ్రామంలో పారిశుద్ధ్యం, పచ్చదనం విషయంలో మెరుగ్గా ఉన్నాం. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. – శ్రీరాంకోటయ్య, ఉపసర్పంచ్, పోలారం గ్రామపంచాయతీ

నిబంధనలు పాటిస్తున్నాం



ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఆదాయ వనరుల వృద్ధిపై దృష్టి సారించాం. ఇప్పటి వరకు చేసిన ప్రయత్నాలు అన్నీ సత్ఫలితాలనిచ్చాయి. తాజాగా పాలకవర్గం ఆలోచన మేరకు ఉన్నతాధికారుల సహకారంతో వార సంతను ఏర్పాటు చేస్తున్నాం. అందరి కృషితో అభివృద్ధి సాధిస్తున్నాం. – ఉప్పు దీప్తి, కార్యదర్శి, పోలారం గ్రామపంచాయతీ

వచ్చే ఎన్నికల్లో ఉద్యమకారులదే విజయం



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో ఎమ్మెల్యే స్థానం స్థానిక ఉద్యమకారుడిదేనని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపు తమదేనని తొలిమలి 1969 ఉద్యమ పోరం రాష్ట్ర గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య ముదిరాజ్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

డబ్బుతో ఓట్లను కొని గెలవచ్చనే ధీమాలో నేడు రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. గెలిచిన నాయకులు ప్రజల సమస్యలను గాలికి వదిలి అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారని, రాజకీయాన్ని వ్యాపారంగా మార్చరని విమర్శించారు. ఉద్యమకారుల కృషి వలన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కస్థానం అందులో 369 మంది విద్యార్థుల మరణాలకు కారణమైన వారి త్యాగాలకు గుర్తు కొత్తగూడెంలో ఎమ్మెల్యేగా ఉద్యమకారుడిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.వలీబాబా, ఎడ్ల ఏలియా, శ్రీపాద సత్యనారాయణ, దేవులపల్లి రామ్మూర్తి, ఏలూరి రాములు, కాకెల్లి సైమన్, తమ్మిశెట్టి రామారావు, అల్లి భాస్కరరావు, సఫ్దార్‌బేగ్, ఆలీముద్దీన్, వీరస్వామి, ఆవునూరి రాయలింగు, ఖమ్మం లింగయ్య, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌-ఇన్

ఇల్లెందు: పట్టణ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్‌ – ఇన్'కార్యక్రమం ఈ నెల 25న శనివారం జరుగనుంది. 'సాక్షి' ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి పట్టణంలోని 24 వార్డుల ప్రజలు నేరుగా తమ సమస్యలను ఫోన్ ద్వారా వివరించే అవకాశం కల్పించింది. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో తమ బస్తీలోని సమస్యలను ఈ కార్యక్రమంలో ప్రస్తావించి పరిష్కారం పొందవచ్చు. కమిషనర్ అంకుషావలీతో నేరుగా మాట్లాడి ఏరియాలోని సమస్యలు వివరించేందుకు 9059359694 నంబరులో సంప్రదించాలి.

శివాలయం కమిటీ చైర్మన్‌గా శ్యాంసుందర్‌రెడ్డి



సుజాతనగర్: స్థానిక శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) నూతన కమిటీ చైర్మన్‌గా మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి విడుదలైన నూతన కమిటీ ప్రతిని పత్రికలకు గురువారం విడుదల చేశారు. సుగ్గల రాధిక, భూక్యా శోభన్, చేతుల పరమయ్య, ఉబ్బనపల్లి ప్రసాద్, గడ్డం వీరరాజశేఖర్, వేములపల్లి వెంకటరావులను కమిటీలో సభ్యులుగా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ హరిశ్చంద్ర శేఖర్ తెలిపారు.

ట్రాలీ డ్రైవర్‌పై కేసు

పాల్వంచరూరల్: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఇద్దరు గాయపడడానికి కారకుడైన ట్రాలీ ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రహదారిపై మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం జామతండాకు చెందిన దంపతులు భూక్యా సోనా, రాందాసు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోగా గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు ఘటనపై బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం ఉప్పుసాకకు చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న మధురవాణి

ఇల్లెందు: మార్చి 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సింగరేణి సేవాసమితి ఇల్లెందు ఏరియా అధ్యక్షురాలు జి.మధురవాణి కోరారు. గురువారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేయాలని, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని కోరారు. మహిళా వేడుకలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, సాయి స్వరూప్, సేవా సెక్రెటరీ కె.విజయ, ఎల్.సులక్షణ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం ఉన్నా.. మంచినీళ్లు లేవు !



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

సుజాతనగర్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతోందని తాగునీరు మాత్రం దొరకడం లేదని పలువురు ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కస్నబోయిన భద్రం, పాత అంజనాపురం సర్పంచ్ భూక్యా రవికుమార్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలో తీవ్రంగా తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వీధుల్లో కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని ఎంపీటీసీలు, సర్పంచులు తెలిపారు. తమ పదవీకాలం ముగిసే సమయం వచ్చినా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నట్లు చెప్పారు. అంతకుముందు ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లోకి అధికారులు వెళ్లిన సమయంలో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని అందరం సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించారు.

కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, పీఆర్ ఏఈ శివలాల్, ఎంఈఓ జుంకీలాల్, ఐటీడీఏ ఏఈ హిమజ, ఏఓ నర్మద, పశువైద్యాధికారి జి.నాగులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.రమాదేవి, జి.సుధతి, వైద్యాధికారి రమేష్, ఎంపీటీసీలు శోభారాణి, పద్మావతి, సర్పంచులు మండె నాగరాజేశ్వరీ, బానోత్ లలిత, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లు లేవు.. పింఛన్లు రావటం లేదు



భగీరథ పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వాలని సూచిస్తున్న హరిప్రియ

ఇల్లెందు: ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ముసలివాళ్లు అయ్యారు. అయినా వారి ఇళ్లకు ఇంటి నంబర్లు లేవు. ఎంతోమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు రావటం లేదు. నల్లాలు ఉన్నా తాగునీళ్లు రావు, ఇంటి ముందుకు వారానికోసారి చెత్త బండి వస్తుంది.. ఎక్కడ చూసినా ఇవే సమస్యలు.. ఇలా పరదేశీ బస్తీలలో ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ జిల్లాకు వచ్చిన సందర్భంగా మున్సిపాల్టీకి రూ.25 కోట్లు, మంత్రి కేటీఆర్ మరో రూ.14.76 కోట్లు విడుదల చేశారని, ఆ నిధులతో వార్డుల్లో చేపట్టాల్సిన పనుల కోసం వార్డు యాత్రలు చేసి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజా సమస్యలు తెలుసుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని 14,15,16 వార్డులలో పర్యటించారు. ప్రజల గోడు విన్న హరిప్రియ.. మీ సమస్యల పరిష్కారానికే మీ వద్దకు వచ్చానని, వార్డుకు రూ.50 లక్షలు కేటాయిస్తున్నానని, అవసరమైతే మరో రూ.20 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. తాగునీటి సమస్యతో పాటు డీ బ్లాక్ వద్ద రోడ్లు, కాలువలు, దుమ్ము, ధూళి లేవకుండా నీళ్లు చల్లించేందుకు జీఎంతో చర్చించినట్లు తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌డీ జానీపాషా, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, కమిషనర్ అంకుషావలీ, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



మాట్లాడుతున్న మున్నా లక్ష్మీకుమారి

సింగరేణి(కొత్తగూడెం): మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు, గ్యాంగ్‌రేపులు పెరుగుతున్నాయని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి అన్నారు. గురువారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో జరిగిన మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. అత్యాచారాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు లేకపోవడంతో ఈ అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను అమలు చేస్తే అత్యాచారాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. మహిళా చట్టాల అమలుకై మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి మహిళల సత్తా చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమటం చంద్రకళ, పద్మజా, కరిష్మ రత్నకుమారి, ఎం.ధనలక్ష్మి, షాహీన్, ఎస్.విజయలక్ష్మి, పి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలు అమలు చేయండి



మాట్లాడుతున్న సాబీర్ పాషా

ఇల్లెందు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలన సంస్కరణల్లో భాగంగా కొత్తగా ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, కొమురారం, బోడు, మాణిక్యారం, సుదిమళ్ల మండలాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో సీపీఐ పట్టణ, మండల కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పీడిత ప్రజల కోసం ఆవిర్భవించిన సీపీఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఇల్లెందు ప్రాంతంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, ప్రభుత్వం ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించి కార్మికుల కడుపు కొడుతోందన్నారు. పూసపల్లి, కోయగూడెం ఓసీలు ప్రైవేట్ పరం కాకుండా సీపీఐ, ఏఐటీయూసీ పోరాడుతుందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కె.సారయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి బ్రహ్మం, జిల్లా సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ, మండల కార్యదర్శులు బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, వార్డు కౌన్సిలర్ కె.రవీందర్, షంషుద్దీన్, వలీ, సాంబమూర్తి, ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన 'స్వచ్ఛ' సిబ్బంది

పాల్వంచ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, సిబ్బంది గురువారం విధులు బహిష్కరించారు. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరించే కార్మికులకు మున్సిపాలిటీ నుంచే వేతనాలు ఇవ్వాలని కోరుతూ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ వద్ద తమ సమస్యను వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: నేటికీ మారుమూల పల్లెల్లో ప్రజలకు పల్లె డాక్టర్‌గా సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి వారి సేవలకు తగిన విధంగా అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కోరింది. గురువారం ఇల్లెందు మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం పట్టణంలోని ఆంబజార్‌లోని నర్సయ్య హాస్పిటల్‌లో జరిగింది. ఈ నెల 26న ఖమ్మంలో జరగనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరావు, బి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏ.సాలయ్య, కొండలరావు, ఏ.రమేష్, అనూష, జయమణి, షాహీన్, శోభామురాయ్, సందీప్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వండి



మాట్లాడుతున్న సైదులు, పాపారావు


ఇల్లెందురూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు పులిసైదులు, ఆరెం పాపారావు డిమాండ్ చేశారు. బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్ వాసులు సర్వే నంబర్ 609 ఖాళీ స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేసుకొని ఆందోళన చేస్తున్న పేదలకు గురువారం వారు సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. పేదలు ఖాళీ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించి వైఎస్ఎంపీపీ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికే పేదలపై కేసులు కూడా పెట్టారని, ఇలాంటి ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ఈ భూమిలో సింగరేణి, మున్సిపాలిటీ అధికారులు ఎటువంటి జోక్యం చేసుకున్నా సహించబోమన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ.. ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలను గురువారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పరామర్శించారు. ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా అర్హులైన పేదలు ఇంటి జాగ కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు విషయాన్ని తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం స్వాతి, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, నాయకులు సాంబమూర్తి, బోళ సూర్యం, శ్రీను, తాటి భిక్షం పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

మరమ్మతులు చేపట్టరూ..



మండల కేంద్రం జూలూరుపాడు నుంచి గుండ్లరేవు గ్రామాల మధ్య బీటీ రోడ్డు గుంతలుమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. జూలూరుపాడు, జడలచింత, పాపకొల్లు, బచ్చలకోయగూడెం, అన్నారుపాడు, గుండ్లరేవు గ్రామాల్లో బీటీ రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ప్రజల రాకపోకలకు కష్టంగా మారింది. వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : లఖన్ నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9866309579